ఈనాడు
పార్వతీపురం మన్యం

డీఎస్సీకి ఉచిత శిక్షణ

సీతంపేట, న్యూస్‌టుడే: డీఎస్సీ-2024 పరీక్షకు సంబంధించి ఎస్టీ, ఎస్సీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు. దీనిలో భాగంగా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఐటీడీఏ పీవో సి. యశ్వంత్ కుమార్‌రెడ్డి తెలిపారు. విశాఖ, విజయవాడ, తిరుపతి తదితర కేంద్రాల్లో మూడు నెలల శిక్షణ ఉంటుందన్నారు. జ్ఞానభూమి పోర్టల్‌లో ఈ నెల 12 నుంచి 21లోపు వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. 22 నుంచి హాల్ టికెట్లు అందుబాటులో ఉంటాయని, 27న ఎంపిక పరీక్ష ఉంటుందని చెప్పారు. ఆగస్టు 28న ఐటీడీఏ స్థాయిలో జరిగిన ఆఫ్‌లైన్ పరీక్ష రద్దు చేసినట్లు చెప్పారు.

కోటదుర్గకు దసరా శోభ


విద్యుత్తు దీపాల వెలుగుల్లో ఆలయం

శుక్రవారం కిటకిటలాడిన ఆలయం

పాలకొండ, న్యూస్‌టుడే: దసరా శరన్నవరాత్రి వేడుకల్లో భాగంగా కోట దుర్గమ్మ ఆలయానికి భక్తులు పోటెత్తారు. శుక్రవారం చివరి రోజు కావడంతో వేకువజాము నుంచే బారులు తీరారు. ఆలయ ప్రధాన అర్చకుడు డి.లక్ష్మీ ప్రసాద్‌శర్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. ఆలయ ఆవరణలో అమ్మవారి ఉత్సవ విగ్రహం మహిషాసురమర్ధినిగా దర్శనమిచ్చారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణలో వందల సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఉత్సవ కమిటీ పర్యవేక్షకులు పి.కొండలరావు, సభ్యులు, సీఐ ఎం.చంద్రమౌళి, ఎస్సై ప్రయోగమూర్తి ఏర్పాట్లను పర్యవేక్షించారు.



నేడు మహా శోభాయాత్ర: పాలకొండ గ్రామీణం, పాలకొండ, న్యూస్‌టుడే: విజయదశమి సందర్భంగా పాలకొండ కోటదుర్గమ్మ మహా శోభాయాత్ర శనివారం నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ పర్యవేక్షకుడు పి.కొండలరావు తెలిపారు. ఉదయం అమ్మవారి దర్శనాలు, వాహన పూజలు ఉంటాయన్నారు. చివరి రోజు భక్తుల తాకిడి అధికంగా ఉండడంతో గర్భగుడి దర్శనాలు నిలిపేస్తామని చెప్పారు. సాయంత్రం మహా లడ్డూ వేలం, సంస్కృతి, సంప్రదాయాల ప్రకారం దేవతామూర్తుల బళ్ల వేషాలు, సవర నృత్యాలు, కర్ర, అగ్గిసాములు, నృత్య ప్రదర్శన నడుమ అమ్మవారిని పట్టణ వీధుల్లో ఊరేగిస్తామని పేర్కొన్నారు.

దరఖాస్తుల కిక్కు



● ఉమ్మడి జిల్లాల్లో ఇంకా పెరిగే అవకాశం

ఈనాడు-పార్వతీపురం మన్యం, పార్వతీపురం పట్టణం, న్యూస్‌టుడే: ఉమ్మడి జిల్లాలో మద్యం దుకాణాల లైసెన్స్‌ల ఎక్సైజ్ అధికారులు ఊహించిన దాని కంటే ఎక్కువ దరఖాస్తులు వచ్చాయి. వ్యాపారుల మధ్య పోటీ వాతావరణం కనిపించింది. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో శుక్రవారం సాయంత్రం 5 గంటలకు విజయనగరం జిల్లాలో 153 దుకాణాలకు 5,050, మన్యం జిల్లాలో 52 దుకాణాలకు 1,328 దరఖాస్తులు వచ్చాయి. రాత్రి 12 గంటల వరకు గడువు ఉన్నందున 7 వేలకు పెరిగే అవకాశం ఉందని ఎక్సైజ్ అధికారులు భావిస్తున్నారు. సిండికేట్లు దుకాణాలు ఇతరులకు దక్కనివ్వకుండా వ్యూహాత్మకంగా ఎక్కువ దరఖాస్తులు దాఖలు చేశారు.

శుక్రవారం సాయంత్రం 5 గంటలకు ఇలా..

జిల్లా	దుకాణాలు	దరఖాస్తులు	ఆదాయం (రూ.కోట్లలో)
పార్వతీపురం మన్యం	52	1,376	27.52
విజయనగరం	153	5,050	101

రూ.128.52 కోట్ల ఆదాయం

దరఖాస్తుదారుల నుంచి ఒక్కో దరఖాస్తుకు రూ.2 లక్షల తిరిగి చెల్లించని రుసుము వసూలు చేశారు. వీటిపై ఉభయ జిల్లాల రూ.127.56 కోట్ల ఆదాయం ప్రభుత్వానికి జమైంది. తుది లెక్కలు తేలిన తర్వాత మరికొంత ఆదాయం పెరిగే అవకాశం ఉంది. శుక్రవారం రాత్రి 7 గంటలకు ఎంత మంది ఉన్నా వారికి టోకెన్లు ఇచ్చి ఆఫ్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తామని ఎక్సైజ్ ఉప కమిషనర్ బాబ్జీరావు 'ఈనాడు'కు తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే వారు రాత్రి 7 గంటల్లోగా రిజిస్ట్రేషన్ చేసుకుంటే రాత్రి 12 గంటల వరకు తీసుకుంటామన్నారు. శనివారం ఉదయానికి కచ్చితమైన సమాచారం లభిస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ నెల 14న దుకాణాల వారీగా డ్రా తీసి వాటికి లైసెన్సులు జారీ చేస్తామని చెప్పారు.

హలో.. ఏ కొండమీద ఉన్నావ్!

● మన్యంలో 83 చరవాణి టవర్ల ఏర్పాటు ● వంద శాతం గ్రామాలకు సంకేతాలే లక్ష్యం

రేషన్ సరకులు కావాలంటే కొండ దిగాలి..
ఏదైనా పథకానికి వేలిముద్ర వేయాలంటే చెట్టు కిందకి చేరాలి..
సమాచారం అందించాలంటే కాలినడకన వెళ్లాలి..

మన్యంలోని పలు గ్రామాల్లో మొన్నటి వరకు ఎదురైన సమస్యలివి. కొండలపై ఉన్న గ్రామాల్లో సంకేతాలు సక్రమంగా అందక గిరిజన ప్రజలు పలు ఇబ్బందులు పడ్డారు. ఇప్పటికీ చరవాణి ముఖం చూడని గ్రామాలు ఇంకా ఉన్నాయి. వీటిని దృష్టిలో ఉంచుకొని కేంద్రం అన్నిచోట్లా సంకేతాల వ్యవస్థను పటిష్ఠం చేసేందుకు టవర్లు ఏర్పాటు చేస్తోంది. ఇప్పటికే చాలా చోట్ల పనులు పూర్తి కాగా.. ఇప్పుడు మిగిలిన గ్రామాల్లోనూ అందుబాటులోకి తీసుకురానుంది.

న్యూస్‌టుడే, పార్వతీపురం, సీతంపేట

ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా 2,305 చోట్ల కొత్తగా 4జీ నెట్‌వర్క్‌తో చరవాణి టవర్లు ఏర్పాటు చేయనుంది. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో 236 నిర్మించనున్నారు. ఈ నేపథ్యంలో గిరిజన ప్రాంతాలున్న జిల్లాకు ఎక్కువ మేలు జరగనుంది.

పార్వతీపురం మన్యంను నీతి ఆయోగ్ ఆకాంక్షిత జిల్లాగా గుర్తించింది. దీంతో జిల్లాలో 83 చరవాణి టవర్ల ఏర్పాటుకు మంజూరు వచ్చింది. కురుపాం, గుమ్మలక్ష్మీపురం, సీతంపేట, సాలూరు మండలాల్లో స్థలాల గుర్తింపు టవర్ల ఏర్పాటు చేశారు. దీంతో ఆయా పరిసర గ్రామాల్లో సంకేతాల వ్యవస్థ మెరుగుపడింది. ఒకప్పుడు గుమ్మలక్ష్మీపురం మండలంలోని గొయిపాక వెళ్లేందుకే ఒక రోజు పట్టేది. ఇప్పుడు టెలికాల్‌లో సమాచారం వెళ్తోంది. మరో 25 రానున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఇవన్నీ కొండ శిఖర ప్రాంతాల్లోనే ఏర్పాటు చేయడంతో ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది.


గుమ్మలక్ష్మీపురం లోవముఠా ప్రాంతంలో ఏర్పాటు చేసిన టవర్

ఎన్నో ప్రయోజనాలు

★ గతంలో రేషన్ సరకుల కోసం సంకేతాలు అందే ప్రాంతాలకు ప్రజలు వచ్చేవారు. కొండలపైనున్న గ్రామాల నుంచి మైదాన ప్రాంతాలకు కాలినడకన చేరుకునేవారు. సిగ్నళ్లు సక్రమంగా లేక మన్యంలోని పలు గ్రామాలకు నెలల తరబడి బియ్యం ఇవ్వడం లేదన్న ఫిర్యాదులు వచ్చాయి.

★ అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే ఆహారానికి సంబంధించి లబ్ధిదారుల వివరాలు, ఫొటోలు, ఇతర సమాచారం రోజూ యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. ప్రస్తుతం మన్యంలోని చాలా గ్రామాల్లో ఈ వివరాలు ఆఫ్‌లైన్లో నమోదు చేస్తున్నారు. దీంతో పర్యవేక్షణ కొరవడుతోంది.

★ మహిళా సంఘాల దైనందిన కార్యక్రమాలు, బ్యాంకు రుణాలు పొందడం, చెల్లింపులు తదితరాలు సక్రమంగా జరగాలంటే సంకేతాలు అందుబాటులోకి రావాలి.


సీతంపేట మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు సంకేతాల కోసం ఇలా కోసంగి కూడలికి రావాల్సిన పరిస్థితి గతంలో ఉండేది. (పాతచిత్రం)

విస్తృతం చేస్తున్నాం

జిల్లాలో విస్తృతంగా చరవాణి టవర్లు ఏర్పాటు చేస్తున్నాం. రానున్న కొన్ని రోజుల్లో వంద శాతం గ్రామాల్లో సిగ్నల్ వ్యవస్థ అందుబాటులోకి రానుంది. దీంతో గిరిజనులు అందరూ సేవలు వినియోగించుకునే అవకాశం కలుగుతుంది.

– ఎ.శ్యామ్‌ప్రసాద్, పాలనాధికారి, పార్వతీపురం

బాలికల బాధ్యత ప్రభుత్వానిది


మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయచంద్ర, పీవో అశుతోష్‌శ్రీవాస్తవ

పార్వతీపురం, న్యూస్‌టుడే: బాలికల సంరక్షణ, సంక్షేమ బాధ్యతను ప్రభుత్వం తీసుకుంటుందని ఎమ్మెల్యే విజయచంద్ర అన్నారు. స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఐటీడీఏ గిరిజన మందిరంలో శుక్రవారం బాలికా దినోత్సవం నిర్వహించారు. ఆడ పిల్లలను ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ఎన్నో పథకాలు అమలు చేస్తోందని తెలిపారు. వారిని చదివించి ఉన్నత స్థాయికి చేర్చేలా తల్లిదండ్రులు చొరవ చూపాలని ఐటీడీఏ పీవో అశుతోష్ శ్రీవాస్తవ కోరారు. మహిళా సంక్షేమ, సాధికారిత జిల్లా అధికారిణి ఎంఎన్.రాణి, డాక్టర్ జగన్‌మోహన్‌రావు, ఐసీడీఎస్ సిబ్బంది, బాలికలు పాల్గొన్నారు.

టికెట్ ధర పెంచితే చర్యలు


తనిఖీలు చేస్తున్న సిబ్బంది


కలెక్టరేట్ ప్రాంగణం, న్యూస్‌టుడే: ప్రైవేట్ ట్రావెల్స్ బస్సుల్లో ప్రయాణికుల నుంచి అధిక ఛార్జీలు వసూలు చేస్తే చర్యలు చేపడతామని జిల్లా రవాణా శాఖ అధికారి దుర్గాప్రసాద్‌రెడ్డి హెచ్చరించారు. హైదరాబాద్, విజయవాడ, రాజమహేంద్రవరం నుంచి పార్వతీపురం, పాలకొండ, సాలూరు వెళ్తున్న ప్రైవేటు బస్సులను శుక్రవారం తనిఖీ చేశారు. అధిక ఛార్జీలు వసూళ్లపై ఫిర్యాదులు వస్తే చర్యలు తప్పవన్నారు. గంజాయి, మాదక ద్రవ్యాల రవాణాపై పటిష్ఠ నిఘా ఉంచినట్లు చెప్పారు. ఏఎంవీలు సత్యనారాయణ, వరప్రసాద్, రమేష్ పాల్గొన్నారు.

దస్త్రాలకు రెక్కలొచ్చాయి

● ఐటీడీఏ వైద్య విభాగంలో కనిపించలేదట..
● ఓ కేసు విషయంలో వాటిని కోరిన పోలీసులు

న్యూస్‌టుడే, పార్వతీపురం

పార్వతీపురం ఐటీడీఏ వైద్య విభాగంలో గతంలో పనిచేసిన ఓ అధికారి హయాంలో ప్రభుత్వ చెక్కులను సొంతానికి ఉపయోగించుకున్నారని విజిలెన్సు గుర్తించింది. దీనిపై పార్వతీపురం పట్టణ పోలీసు స్టేషనులో వైద్య, ఆరోగ్య శాఖ ఫిర్యాదు మేరకు ప్రభుత్వ నిధుల దుర్వినియోగానికి సంబంధించి సదరు అధికారిపై కేసు నమోదైంది. ఈ కేసుకు సంబంధించి పోలీసు అధికారులు కొన్ని వివరాలకు దస్త్రాలు కావాలని ఐటీడీఏ అధికారులను కోరారు.



కొండలపై నుంచి గర్భిణులను ఆసుపత్రులకు తీసుకువచ్చేందుకు ఐటీడీఏ పరిధిలో 2018లో పల్లకీ నిధులు ఉండేవి. అప్పటి పీవో అందులో నుంచి రూ.17.88 లక్షలు సదరు అధికారికి ఇచ్చారు. ఆ మంజూరు పత్రాన్ని దర్యాప్తు అధికారులు కోరారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో నడిచే ఏడు అంబులెన్సులకు ఇంధన వ్యయం చెల్లించేందుకు రూ.19 లక్షలు పీవో ఖాతా నుంచి ఆ అధికారికి బదిలీ కాగా.. ఆ ఆదేశాలకు సంబంధించిన పత్రాలు, నిధుల వినియోగ రసీదులు, వాహనాల వివరాలను సమర్పించాలన్నారు. అప్పట్లో పనిచేసిన ఇద్దరి అధికారుల సంతకాల స్పెసిమెన్లు అడిగారు. నిధుల విడుదలకు సంబంధించి ఐటీడీఏ కార్యాలయంలో ఉన్న రికార్డుల మేరకు వివరాలను పోలీసులకు సమర్పించినట్లు ఏఏవో ప్రసాద్ 'న్యూస్‌టుడే'కు తెలిపారు. వైద్య ఆరోగ్య విభాగం నుంచి అంబులెన్సుల వినియోగానికి సంబంధించిన వివరాలు, వేతన చెల్లింపుల రికార్డులు, అప్పట్లో పనిచేసిన ఇద్దరు అధికారుల స్పెసిమెన్ సంతకాలను సమర్పించాల్సి ఉంది. వీటి దస్త్రాలు ప్రస్తుతం ఈ విభాగంలో అందుబాటులో లేవని తెలిసింది. రూ.36 లక్షలకు పైగా నిధుల వినియోగానికి సంబంధించి దర్యాప్తునకు అవసరమైన వివరాలు లేకపోవడంపై పలు ప్రశ్నలు తలెత్తుతున్నాయి. విజిలెన్సు అధికారులు తమ దర్యాప్తులో భాగంగా అసలు దస్త్రాలన్నీ తీసుకువెళ్లి.. తిరిగి కార్యాలయానికి కేవలం జెరాక్స్ కాపీలే అందజేశారని సంబంధిత కార్యాలయ వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటి అధికారులు అసలు పత్రాలు చూడకుండా నకళ్లను ధ్రువీకరించే పరిస్థితి లేకపోవడంతో దర్యాప్తు అధికారులకు దస్త్రాలు సమర్పించడంలో జాప్యం జరుగుతోంది. ఇటీవల కార్యాలయ సిబ్బంది పోలీసులను సంప్రదించి విజిలెన్సు అధికారుల వద్ద అసలు పత్రాలు ఉన్నట్లు తెలియజేశారు. దీనిపై ప్రస్తుత డిప్యూటీ డీఎంహెచ్‌వో పద్మావతి వద్ద ప్రస్తావించగా.. తాను కొత్తగా బాధ్యతలు తీసుకున్నానని, వివరాలు తెలుసుకోవాల్సి ఉందన్నారు. దీనిపై సమగ్ర సమాచారం తెలుసుకుంటానని పేర్కొన్నారు.


పూడిక తొలగిస్తున్న జన్నివలస రైతులు

300 ఎకరాల కోసం.. 30 మంది కదిలారు

పాచిపెంట, న్యూస్‌టుడే: పెద్దగెడ్డ జలాశయం నుంచి వేల ఎకరాలకు సాగునీరు వెళ్తుంది. మన్యం, విజయనగరం జిల్లాల పరిధిలోని పలు గ్రామాల రైతులకు ఈ జలాలే ఆధారం. కానీ కాలువలు అధ్వానంగా ఉండటంతో పూర్తిస్థాయిలో చేరడం లేదు. ప్రాజెక్టుకు విజయనగరం జిల్లా రామభద్రపురం మండలం జన్నివలస శివారు ఆయకట్టు గ్రామం. అక్కడి రైతులు 300 ఎకరాల్లో పంటలు వేశారు. కానీ నీటి ప్రవాహం అందక వరి పంట ఎండిపోయే స్థితికి చేరింది. ఏటా ఇదే సమస్యతో నష్టపోతున్నామని రైతులు చెబుతున్నారు. చేసేది లేక 30 మంది ఏకమయ్యారు. కాలువ మొదట నుంచి గ్రామం వరకు 12 కిలోమీటర్ల పరిధిలో పూడిక తొలగింపునకు నడుం బిగించారు. శుక్రవారం పాచిపెంట ప్రధాన కాలువ రెండో కిలోమీటరు నుంచి పనులు ప్రారంభించారు. తమ పొలాలకు నీరు వచ్చే వరకు పూడిక తీస్తామని రైతు పి.యోగినాయుడు తదితరులు చెబుతున్నారు.

13 నుంచి బ్రహ్మోత్సవాలు



గరుగుబిల్లి, న్యూస్‌టుడే: తోటపల్లి వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఈ నెల 13 నుంచి 15 వరకు బ్రహ్మోత్సవాలు (పవిత్రోత్సవాలు) నిర్వహిస్తున్నట్లు ఈవో వి.వి.సూర్యనారాయణ తెలిపారు. 12న సాయంకాలం 6 గంటల నుంచి విశేష పూజలు ప్రారంభమవుతాయని, 13 నుంచి ఉత్సవాలు జరుగుతాయని ప్రధాన అర్చకులు వి.వి.అప్పలాచార్యులు పేర్కొన్నారు.

మార్కెట్ కమిటీలపై నిఘా నేత్రం

ఆదాయం మెరుగుకు విజిలెన్స్ కమిటీలు

న్యూస్‌టుడే, బొబ్బిలి

ఉమ్మడి జిల్లాలోని వ్యవసాయ మార్కెట్ కమిటీల ఆదాయం మెరుగుకు ప్రభుత్వం విజిలెన్సు కమిటీలు ఏర్పాటు చేసింది. చెక్‌పోస్టుల వద్ద వాహనాలను ఆపి రవాణా అవుతున్న వ్యవసాయ ఉత్పత్తులపై రెండు శాతం పన్ను వసూలు చేసి రసీదులు అందజేయాలి. కొన్నిచోట్ల ఇది పక్కాగా జరగడం లేదు. అక్కడి సిబ్బంది చేతివాటం చూపుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. దీనికి అడ్డుకట్ట వేసేందుకు ఉన్నతాధికారులు విజిలెన్సు కమిటీలు ఏర్పాటు చేశారు. ఈ నెల నుంచే ఆకస్మిక సోదాలు నిర్వహించి ప్రభుత్వానికి నివేదికలు పంపనున్నారు.


బొబ్బిలి వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం

సభ్యులు వీరే

★ విజయనగరం జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి నేతృత్వంలో కార్యదర్శుల హోదాలో పనిచేస్తున్న జి.చంద్రమౌళి, ఆర్.సతీష్, ఆర్.విజయబాబు, కె.ఈశ్వరరావు కమిటీ సభ్యులుగా నియమితులయ్యారు.

★ మన్యం జిల్లాలో జిల్లా మార్కెటింగ్ ఇన్‌ఛార్జి అధికారి జీఆర్ రావు ఆధ్వర్యంలో కార్యదర్శులు వి.సతీష్‌కుమార్, వి.ఆర్.వి.ఎస్ ధీరజ్‌రాజు, టి.అనిల్ ప్రసాద్, నరేష్‌కుమార్ నియమితులయ్యారు.

★ వీరు ఉమ్మడి జిల్లాలోని 13 కమిటీల పరిధిలో చెక్‌పోస్టుల సందర్శన, సెస్ వసూళ్ల తీరు, కమిటీల ఆదాయ వ్యయాలు, ఖర్చుల వివరాలపై సోదాలు చేయనున్నారు.

నిధులు పక్కదారి పట్టకుండా..

మార్కెట్ కమిటీల్లో నిధులు పక్కదారి పట్టకుండా కమిటీలు నిఘా పెడతాయి. గత ప్రభుత్వ హయాంలో కమిటీల్లో రూ.కోట్లు దుర్వినియోగమయ్యాయి. పొరుగు జిల్లాలో ఓ కమిటీ కార్యదర్శి రూ.2 కోట్లపై చిలుకు ఆయన సొంత ఖాతాకు మళ్లించుకున్నారు. ఇలాంటివి జరగకుండా విజిలెన్సు కమిటీలు పర్యవేక్షించనున్నాయి. ప్రస్తుతం పాలక వర్గాలు లేకపోవడంతో ఉద్యోగులే కీలకమయ్యారు. పన్నుల వసూళ్లు పారదర్శకంగా చేపట్టేందుకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కమిటీలు ఏర్పాటు చేసినట్లు జిల్లా మార్కెటింగ్ అధికారి రవికృష్ణ 'న్యూస్‌టుడే'కు తెలిపారు.

● ఉమ్మడి జిల్లాలో కమిటీలు: 12 ● ఏడాదికి పన్నుల లక్ష్యం: రూ.17.12 కోట్లు ● ప్రస్తుతం వసూలవుతుంది: దాదాపు రూ.12.67 కోట్లు

పండగ శోభ



నగర పాలక సంస్థలో రూ.1.20 కోట్లతో పైడితల్లి జాతరకు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రధాన కూడళ్లు, నగర పాలక సంస్థ కార్యాలయం, గురజాడ ఇంటిని విద్యుత్తు దీపాలతో అలంకరించారు. యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి చేస్తున్నామని కమిషనరు పి.నల్లనయ్య 'న్యూస్‌టుడే'కు తెలిపారు.
-న్యూస్‌టుడే, విజయనగరం పట్టణం

కళకళలాడుతున్న గురజాడ కూడలి





నగరపాలక సంస్థ కార్యాలయం, బుద్ధ విగ్రహం వద్ద విద్యుత్తు దీపాలంకరణ

ఆయుధ పూజ



బొబ్బిలి కోటలో శుక్రవారం సంప్రదాయబద్ధంగా ఆయుధ పూజ జరిగింది. బొబ్బిలి యుద్ధంలో వినియోగించిన కత్తులు, బల్లేలు, ఇతర ఆయుధాలకు మాజీ మంత్రి సుజయకృష్ణ రంగారావు, సోదరుడు, ఎమ్మెల్యే బేబినాయన, వినీత్ పూజలు నిర్వహించారు. ఉమ్మడి రాష్ట్రాల ముఖ్యమంత్రిగా పనిచేసిన ఆర్‌ఎస్‌ఆర్‌కే రంగారావు, తండ్రి ఆర్‌వీకే రంగారావు, వారి బంగారు, వెండి సింహాసనాలు, కర్రలను పూజించారు. -న్యూస్‌టుడే, బొబ్బిలి



బంగారు సింహాసనానికి పూజలు చేస్తున్న మాజీ మంత్రి సుజయ, ఎమ్మెల్యే బేబినాయన

యంత్రం.. జీవనోపాధి మంత్రం!

● కేంద్ర ప్రభుత్వ రాయితీలు వర్తింపు
● అఖిల భారత డ్వాక్రా సరస్‌లో ప్రదర్శన

న్యూస్‌టుడే, విజయనగరం మయూరి కూడలి

ఇంటి వద్దనే యంత్రాలను ఉపయోగించుకుని, తద్వారా స్వయం ఉపాధి పెంపొందించుకోవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆలోచన. ఆ దిశగా స్వయం సహాయక సంఘాలకు చెందిన మహిళలకు ప్రత్యేకించి కేంద్రం పీఎంఈజీపీ, పీఎంఎఫ్‌ఎంఈ వంటి పథకాల ద్వారా వివిధ రకాల యూనిట్లు అందిస్తోంది.

పైడితల్లి పండగలో భాగంగా విజయనగరం ఉత్సవాల్లో ఈ ఏడాది డీఆర్‌డీఏ- వెలుగు ఆధ్వర్యంలో నగరంలోని లోటస్ ట్యాంక్ బండ్ రోడ్డు వద్ద అఖిల భారత డ్వాక్రా బజార్ (సరస్ 2024)ను ఏర్పాటు చేశారు. దీన్ని శుక్రవారం మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ప్రారంభించారు. ఇందులో వివిధ రకాల స్టాళ్లను ఏర్పాటు చేశారు. ఇంటి వద్దనే ఉపాధి పొందేందుకు ఉపయోగపడే యంత్రాలను ప్రదర్శించారు. ఫ్లోర్ మిల్లు, మినీ రైస్ మిల్లు, ఫిష్ డ్రైయర్‌తో పాటు వివిధ రకాలను అందుబాటులో ఉంచారు. వీటి ధరలో 10 నుంచి 20 శాతం చెల్లిస్తే మిగిలిన మొత్తం రుణంగా బ్యాంకులు మంజూరు చేస్తాయి.

గంటకు 50 కిలోలు..



పొలంలో నూర్పు వేసిన ధాన్యాన్ని పాడి క్లీనర్ యంత్రంలో వేసి మర ఆడుకోవచ్చు. దీని ద్వారా చెత్తను పూర్తిగా శుభ్రం చేస్తుంది. అలాగే పొల్లు, దూళిని అంతా వేరు చేసి మంచి ధాన్యం ఇస్తుంది. గంటకు 50 కిలోల ధాన్యం వేసుకోవచ్చు. చిన్న రైతులకు చాలా ఉపయోగంగా ఉంటుంది.

ఆరు గంటల్లో ఎండు చేపలు



ఈ ఫిష్ డ్రైయర్‌లో నేరుగా చెరువు, సముద్రంలో పట్టిన పచ్చి చేపలు వేస్తే ఆరు గంటల్లో వాటిని పూర్తిగా ఎండు చేపలుగా మార్చేస్తుంది. ఒకేసారి 25 కిలోల చేపలు వేసుకోవచ్చు. దీని ఖరీదు రూ.88 వేలు ఉంటుంది. విద్యుత్తు కూడా తక్కువ అవుతుంది. వీటిని రాయితీపై అందిస్తారు.

విద్యుత్తు వ్యయం తక్కువే..



ఈ మినీ మిల్లును ఇంట్లోనే ఏర్పాటు చేసుకోవచ్చు. దీనికి ప్రత్యేకించి విద్యుత్తు మీటర్ అవసరం లేదు. తక్కువ విద్యుత్తు సరిపోతుంది. ఇందులో గంటకు 25 కిలోల ధాన్యం ఆడుకోవచ్చు. దీంతో ఇంటి వద్దనే మహిళలు జీవనోపాధులు పొందవచ్చు.

హోటళ్లకు ఉపయుక్తం..



ఈ అట్ట కేండర్ యంత్రం ఎక్కువగా హోటళ్లతో పాటు కొంత మంది మహిళలు ఇంటి వద్దనే తయారు చేసే ఆహార పదార్థాలకు ఉపయోగిస్తారు. నేరుగా పిండిని ఇందులో వేస్తే ముద్ద తయారుచేస్తుంది. గంటకు 20 కిలోల అన్ని రకాల పిండిని ముద్దగా చేసి ఇస్తుంది. ఎక్కువగా గోధుమ, సెనగ పిండి, ఇడ్లీ పిండి, చట్నీలకు ఉపయోగిస్తారు.

పిండి మిల్లుతో ఆదాయం

పిండి మిల్లుతో మహిళలు ఎక్కువ ఆదాయం పొందవచ్చు. ఇంటి వద్దనే ఏర్పాటు చేసి తద్వారా అన్ని రకాల (పొడి, తడి) పదార్థాలను ఒకేసారి అయిదు కిలోల వరకు వేసుకొని ఆడుకోవచ్చు. విద్యుత్తు కూడా రోజంతా ఉపయోగించినా 2 నుంచి 4 యూనిట్ల వరకు అవుతుంది. మంచి ఆదాయం వస్తుంది.

వెయిట్‌లిఫ్టింగ్‌లో ఆరు పతకాలు

నెల్లిమర్ల, న్యూస్‌టుడే: హిమాచల్‌ప్రదేశ్‌లో జరుగుతున్న జాతీయస్థాయి పోటీల్లో విజయనగరం జిల్లా క్రీడాకారులు సత్తా చాటారు. నగ్రోట్ భగవాన్‌లో ఈనెల 6 నుంచి 13 వరకు జరుగుతున్న ఐడబ్ల్యూఎల్ఎఫ్ వెయిట్‌లిఫ్టింగ్ సీనియర్, జూనియర్ విభాగాల్లో ఆరు పతకాలు సాధించారు. కొండవెలగాడ గ్రామానికి చెందిన కె.దినేష్‌కుమార్, బి.భార్గవి, బి.హారిక, చంద్రంపేటకు చెందిన ఎస్.గురునాయుడు, కె.అనిల్‌కుమార్, నెల్లిమర్లకు చెందిన బి.చంద్రిక పతకాలు సాధించారు.

జాతీయ జెండాను అవమానించారంటూ..

హైకోర్టులో వ్యాజ్యం

ఈనాడు, అమరావతి: కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి ఆగస్టు 15న జాతీయ జెండాను తలకిందులుగా ఎగురవేసి అవమానించారని, ఈ వ్యవహారంపై సెప్టెంబరు 17న ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా చర్యలు తీసుకునేలా కలెక్టర్, ఎస్పీలను ఆదేశించాలని కోరుతూ డి.పోతయ్య, మరో ఇద్దరు హైకోర్టులో వ్యాజ్యం దాఖలు చేశారు. దీనిపై విచారణ వాయిదా (దసరా సెలవుల అనంతరం) పడింది. ఈ నెల 1న ఈ వ్యాజ్యంపై జరిగిన విచారణలో.. సహాయ ప్రభుత్వ న్యాయవాది స్పందిస్తూ.. పూర్తి వివరాలు సమర్పించేందుకు సమయం కావాలని కోరారు. న్యాయమూర్తి అందుకు అంగీకరిస్తూ విచారణను వాయిదా వేశారు.

వృద్ధురాలి అనుమానాస్పద మృతి

రాజాం, న్యూస్‌టుడే: రాజాం పట్టణంలోని బాబానగర్ మూడో వీధికి చెందిన బత్తుల యశోద (62) అనుమానాస్పదంగా మృతి చెందారు. గురువారం రాత్రి ఇంట్లో నిద్రించిన ఈమె శుక్రవారం ఉదయం చాలా సమయం అయినా బయటకు రాకపోవడంతో కింద ఇంట్లో ఉంటున్నవారు గుర్తించి తలుపు కొట్టినా ప్రయోజనం లేకపోయింది. స్థానికులు తలుపులు తెరిచి చూడగా అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో రాజాం ఎస్సై రవికిరణ్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. బయట వ్యక్తులెవరూ లోనికి వచ్చిన ఆనవాళ్లు లేవని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు. ఈమె కుమారులు వేర్వేరు ప్రాంతాల్లో ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. భర్త మృతి చెందడంతో ఒంటరిగానే ఉంటున్నారు. కుమారుడు గిరీష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్లు సీఐ గిరీష్‌కుమార్ తెలిపారు.

కుటుంబ కలహాలతో బలవన్మరణం

బాడంగి(రామభద్రపురం), న్యూస్‌టుడే: కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన బాడంగి మండలంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ తారకేశ్వరరావు తెలిపిన వివరాల మేరకు.. బొబ్బిలి పట్టణానికి చెందిన సి.రామారావు(41) గురువారం మద్యం తాగి ఇంటికి రావడంతో భార్య మందలించింది. మనస్తాపానికి గురై అత్తవారి ఊరు బాడంగి మండలం వీరసాగరం శివారుకు చేరుకుని పురుగుల మందు తాగి అపస్మారక స్థితికి చేరుకున్నారు. విషయం తెలుసుకున్న బంధువులు బాడంగి సీహెచ్‌సీకి, అక్కడి నుంచి విజయనగరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ రామారావు శుక్రవారం మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చెప్పారు. మృతుడికి భార్యతో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు.

సెలవులకు వచ్చి మృత్యువాత



షణ్ముఖ్ (పాత చిత్రం)

గుర్ల, న్యూస్‌టుడే: వ్యాను ఢీకొన్న ఘటనలో బాలుడు మృతి చెందిన సంఘటన పాలవలసలో శుక్రవారం చోటు చేసుకుంది. గుర్ల ఎస్‌ఐ పి.నారాయణరావు అందించిన వివరాల ప్రకారం.. విశాఖపట్నానికి చెందిన చింతల ఈశ్వరరావు కుమారుడు షణ్ముఖ్ (5) దసరా సెలవులకు తాత గారింటికి వచ్చాడు. గ్రామంలోని ఓ కల్లం వద్ద ఆడుకుంటుండగా శుక్రవారం వ్యాను ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే విజయనగరం ఆసుపత్రికి తరలించగా.. అప్పటికే చనిపోయినట్లు వైద్యులు ధ్రువీకరించారు. గుర్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికెన్ ధరలు

రకం	(బ్యాగ్)లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
బ్రాయిలర్	138	246	256

వేగంగా స్పందించారు..
గర్భిణి ప్రాణం నిలబెట్టారు



ప్రమీలకు ఆసుపత్రిలో ప్లేట్‌లెట్స్ ఎక్కిస్తున్న సిబ్బంది

పార్వతీపురం పట్టణం, న్యూస్‌టుడే: జియ్యమ్మవలసకు చెందిన ఎస్.ప్రమీల నిండు గర్భిణి.. తీవ్ర అస్వస్థతతో ఉదయం 6 గంటలకు జిల్లా ఆసుపత్రిలో చేరారు. వైద్యులు పరీక్షిస్తే.. మాయ చిట్లిపోయి పొట్టలో రెండు లీటర్ల రక్తం చేరినట్లు గుర్తించారు. అప్పటికే బిడ్డ కన్నుమూసింది. తల్లి కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతోంది. ప్రాణాపాయంలో ఉన్నట్లు గుర్తించి ఆమెను విజయనగరం రిఫర్ చేయాలని వైద్యులు భావించారు. కానీ ఆలస్యమైతే మరింత ప్రమాదమని గుర్తించి జిల్లా ఆసుపత్రి వైద్యులు విజయవంతంగా శస్త్ర చికిత్స చేశారు. బిడ్డ మృతదేహం, పొట్టలోని రక్తం బయటకు తీశారు. ఆమెకు రక్తం 7 గ్రాములు, ప్లేట్‌లెట్స్ 54 వేలకు పడిపోవడంతో అత్యవసరంగా కుటుంబ సభ్యులను బొబ్బిలి పంపించారు. వారు వచ్చే సరికి మధ్యాహ్నం 12 అయ్యింది. ఈ సమయంలో 4 యూనిట్ల రక్తంతో పాటు ప్లేట్‌లెట్లు ఎక్కించి ఆమె ప్రాణాలు నిలిపారు. దీంతో జిల్లా ఆసుపత్రి పర్యవేక్షకురాలు వాగ్దేవి, వైద్యులు, సిబ్బందికి ప్రమీల కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

డుమ్మా.. కుదరదిక!
ఇంటర్ విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డులు



ఇంటర్మీడియట్ విద్యార్థులు

పార్వతీపురం పట్టణం, న్యూస్‌టుడే: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చేరే విద్యార్థులు చాలా మంది వార్షిక పరీక్షలకు హాజరు సరిపోక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ ప్రభావం ఉత్తీర్ణత శాతంపై పడుతోంది. ఈ పరిస్థితులను చక్కదిద్దేందుకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తోంది. ప్రభుత్వ, ఎయిడెడ్ కళాశాలల్లో విద్యా ప్రమాణాలు పెంచేలా కొత్తగా ప్రోగ్రెస్ కార్డుల విధానం ప్రవేశపెట్టింది.

జిల్లాలో వివరాలు..

- ప్రభుత్వ జూనియర్ కళాశాలలు: **14**
- గిరిజన సంక్షేమ కళాశాలలు: **9**
- ఆదర్శ పాఠశాలలు, కేజీబీవీలు: **16**
- ప్రైవేటు కళాశాలలు: **30**
- మొత్తం విద్యార్థులు: **20 వేల మంది**

40 శాతం లోపే ఉత్తీర్ణత..

జిల్లాలోని 15 మండలాల పరిధిలో 14 జూనియర్, గిరిజన, ఆదర్శ కళాశాలలు, కేజీబీవీలు 25, ప్రైవేటు కళాశాలలు 30 వరకు ఉన్నాయి. ప్రథమ, ద్వితీయ ఏడాది విద్యార్థులు 20,200 మంది చదువుతున్నారు. ఏటా ప్రైవేటు, కార్పొరేట్ కళాశాలల్లో ఉత్తీర్ణత శాతం ఎక్కువగా ఉంటుంది. ప్రభుత్వ కళాశాలల్లో చాలా చోట్ల 40 శాతంలోపు నమోదవుతోంది. ఈ నేపథ్యంలో కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ కళాశాలలను తీర్చిదిద్దాలంటే విద్యార్థులు సక్రమంగా తరగతులకు హాజరు కావాల్సి ఉందని ప్రభుత్వం గుర్తించింది. గతంలో ప్రభుత్వ పాఠశాలల్లో అమల్లో ఉన్న ప్రోగ్రెస్ కార్డులను జగన్ ప్రభుత్వం తొలగించింది. వీటి పునరుద్ధరణకు కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో పలువురు ప్రిన్సిపాళ్లు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

తల్లిదండ్రులతో సమావేశాలు

బోర్డు అధికారుల ఆదేశాలతో ప్రోగ్రెస్ కార్డుల నమూనాలు తయారు చేయించాం. ప్రథమ, ద్వితీయ, వృత్తి విద్యా కోర్సులకు వేర్వేరు రంగుల్లో ముద్రించాం. పిల్లలు కళాశాలకు వస్తున్న, చదువుతున్న విధానాలు తల్లిదండ్రులకు తెలియజేస్తాం. వారితో తరచూ సమావేశాలు నిర్వహించి విద్యార్థుల ప్రగతి గురించి చర్చిస్తాం.
- జె.రామారావు, నాగేశ్వరరావు, జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లు, పార్వతీపురం, కొమరాడ

దుర్గంధం.. ప్రమాదకరం



పాలకొండ మండల పరిధిలోని అంపిలి సచివాలయాన్ని ఆనుకొని ఉన్న గుంత ప్రమాదకరంగా మారింది. కాలువల్లోని నీరంతా ఇక్కడకే చేరుతోంది. వర్షపు నీరు నిల్వ చేరడంతో దోమలు విజృంభిస్తున్నాయి. సచివాలయం, రహదారి పక్కనే గుంత ఉండటంతో వాహన చోదకులు ఏమాత్రం ఆజాగ్రత్తగా ఉన్నా ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉంది. దీనిపై మండల ప్రత్యేకాధికారి ఎస్.మన్మథరావు వద్ద ప్రస్తావించగా.. వీధి కాలువ నిర్మించి గుంత పూడుస్తామన్నారు. – న్యూస్‌టుడే, పాలకొండ గ్రామీణం

పండగ పూటా పాట్లే!

పాలకొండ నగర పంచాయతీ పరిధిలోని గారమ్మకాలనీ ప్రజలకు పండగ పూటా పాట్లు తప్పడంలేదు. కాలనీకి తాగునీటిని అందించే పైపులైన్లు గెడ్డెవ వంతెన నిర్మాణం సమయంలో తొలగించారు. తర్వాత పనులు జరగక నీటికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోజూ అధికారులు ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేస్తున్నా సరిపోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అనుసంధాన మార్గం పూర్తయితే పైపులైన్లు పునరుద్ధరిస్తామని ఏఈ దేవిప్రసాద్ తెలిపారు. – న్యూస్‌టుడే, పాలకొండ




ఆరు నెలలుగా.. అసంపూర్తిగా!



బలిజిపేట మండలంలోని వెంగాపురం మండల పరిషత్తు ప్రాథమిక పాఠశాలలో నాడు- నేడు రెండో విడత కింద అదనపు భవన నిర్మాణానికి ప్రభుత్వం రూ.12 లక్షలు మంజూరు చేసింది. సుమారు రూ.7.60 లక్షలతో స్లాబ్ వరకు పనులు చేశారు. రూ.5.68 లక్షలు మాత్రమే బిల్లులు చెల్లించారు. మిగిలిన నగదు చెల్లించకపోవడంతో ఆరు నెలలుగా పనులు ఆపేశారు. దీనిపై జేఈ త్రినాథరావు వద్ద ప్రస్తావించగా.. ప్రభుత్వం దృష్టికి విషయం తీసుకెళ్తామన్నారు. – న్యూస్‌టుడే, బలిజిపేట

శిథిల వంతెనతో భయం

భామిని మండలంలోని బత్తిలి నుంచి కొత్తూరు వరకు బ్రిటీష్ కాలంలో నిర్మించిన వంతెనలు శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారాయి. గోడలు, అడుగు భాగం పెచ్చులూడాయి. కర్మొమ్మ, సతివాడ, పసుకుడి, బత్తిలి, భామిని, చిన్నదిమిలిలో ఇదే పరిస్థితి ఉంది. సతివాడలో వంతెనను చుట్టూ చిత్తులతో మూడుకున్నాయి. దీనిపై ఆర్అండ్‌బీ ఏఈ జగన్మోహనరాజు వద్ద ప్రస్తావించగా.. పాతైన వంతెనలు గుర్తించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామన్నారు. – న్యూస్‌టుడే, భామిని



ముక్కిడమ్మకు చల్లదనం



దుర్గాష్టమి సందర్భంగా సీతంపేట మండలం ముక్కిడి దేవతకు పులిపుట్టి, పి.పి.ఈతమానుగూడ పంచాయతీల పరిధిలోని ప్రజలు చల్లదనం చేశారు. శుక్రవారం ముక్కలు చెల్లించారు. పసుపు నీళ్లతో ఆలయానికి చేరుకొని మొక్కులు చెల్లించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు ఎస్.తోటముఖలింగం, కె.కూర్మారావు, పొట్టేమ్, కార్తిక్, పున్నయ్య, సంహాద్రి, సర్పంచులు ఎస్.జాజన్న, సుజాత తదితరులు పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, సీతంపేట

మేమున్నాం.. మీకు తోడుగా

(10 AM TO 1 PM)

పార్వతీపురం	8008566244
పాలకొండ	8008574299
సాలూరు	8008786820
కురుపాం	9849044696

? కొత్తవలసలోని కొత్తపోలమ్మ కాలనీలో ఒక వైపు కాలువల్లోని పూడిక తీసి మరోవైపు వదిలేశారు. - మహాలక్ష్మి, స్థానికురాలు

* పరిశీలించి మురుగు తీయిస్తాం. - కనకరాజు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ – న్యూస్‌టుడే, వెలగాం

? పి.రావివలసలో కొన్ని నెలలుగా పారిశుధ్య పనులు జరగక కాలువలో పూడిక పేరుకుపోయింది. - స్థానికులు

* పరిశీలించి పారిశుద్ధ్య పనులు చేపడతాం. - ఎ.జయప్రకాశ్, సర్పంచి – న్యూస్‌టుడే, గరుగుబిల్లి

? పాలకొండ ఏలాం కూడలిలో చెత్త కుప్పలు రహదారిపై అపరిశుభ్రంగా ఉన్నాయి. - లక్ష్మణ్, విద్యార్థి

* వ్యర్థాలు తొలగించి శుభ్రం చేయిస్తాం. - ఎస్.సర్వేశ్వరరావు, కమిషనరు – న్యూస్‌టుడే, పాలకొండ గ్రామీణం

దారి.. మారనుంది

- 8 రహదారుల అభివృద్ధికి చర్యలు



కంబరవలస మీదుగా కంబర వెళ్లే రహదారి

వీరఘట్టం, న్యూస్‌టుడే: వీరఘట్టం, పాలకొండ మండలాల రహదారులకు మోక్షం కలగనుంది. గత ఐదేళ్లలో పాలకుల నిర్లక్ష్యానికి గురైన దారులకు మంచి రోజులు రానున్నాయి. ఇన్నాళ్లు ఎక్కడికక్కడ గుంతలతో అధ్వానంగా మారిన రహదారులను కూటమి ప్రభుత్వం బాగు చేయనుంది. ఈ రెండు మండలాల్లోని 8 రహదారులకు రూ.10.10 కోట్లు కేటాయించింది. ఉపాధి హామీ నిధులతో సీతంపేట గిరిజన సంక్షేమ శాఖ ఇంజినీరింగు విభాగం ఆధ్వర్యంలో పనులు చేసేలా కార్యాచరణ ప్రారంభమైంది.

రూ.కోట్లలో కేటాయింపు..

సీసీఎస్ రహదారి నుంచి ఎం.రాజపురం మీదుగా కత్తులకవిటి వరకు రూ.2 కోట్లు, కంబరవలస మీదుగా కంబర వరకు రూ.1 కోటి, కొట్టుగుమ్మడ మీదుగా గడగమ్మ వరకు రూ.1.10 కోట్లతో రహదారులను అప్‌గ్రేడ్ చేయనున్నారు. * పాలకొండ మండలం టీకే రాజపురం నుంచి తలవరం మీదుగా టీడీ పారాపురం వరకు రూ.1.50 కోట్లు, వాటాగాం చింతాడ మీదుగా పద్మాపురం వరకు రూ.1.90 కోట్లు, వీరఘట్టం నుంచి అర్లి వరకు రూ.80 లక్షలు, బుక్కూరు మీదుగా టీకే రాజపురం వరకు రూ.1 కోటి ఖర్చు చేసి కొత్త దారులు వేయనున్నారు. సీసీఎస్ రహదారి నుంచి తంపటాపల్లి వరకు రహదారి అభివృద్ధికి రూ.80 లక్షలు మంజూరు చేశారు.

త్వరలో ప్రారంభిస్తాం..

పాలకొండ, వీరఘట్టం మండలాల్లో 8 రహదారుల అభివృద్ధికి ఉపాధి హామీ నిధులు మంజూరయ్యాయి. త్వరలో పనులు ప్రారంభిస్తాం. సాధ్యమైనంత వేగంగా పూర్తిచేసి వినియోగంలోకి తీసుకువస్తాం. – కె.నాగభూషణరావు, ఏఈ, గిరిజన సంక్షేమశాఖ, సీతంపేట

పెరటి తోటలతో పోషకాలు



అరసాడలో వంగ, అరటి తోటలు

అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, వసతి గృహాల పరిధిలో పెరటి తోటల పెంపకంతో పిల్లలకు మంచి పోషకాహారం లభిస్తుందని అధికారులు, వైద్యులు చెబుతున్నారు. పార్వతీపురం నియోజకవర్గంలో కొన్ని గ్రామాల్లో ఈ పథకం అమలు చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. సంబంధిత శాఖ నుంచి వచ్చిన విత్తనాలతో తోటలు పెంచి పిల్లలకు, గర్భిణులకు పోషకాహారం అందజేస్తున్నారు. – న్యూస్‌టుడే, పార్వతీపురం గ్రామీణం, బలిజిపేట గ్రామీణం

పార్వతీపురం మండలంలోని పెదబొండపల్లి కేంద్రంలో కార్యకర్త అలివేణి బీర, బెండ, ఆనప, వంగ, ఆకుకూరలు పెంచుతున్నారు. బాలగుడు, అల్లాఫుల్, కొత్తఊరు, గంగాపురం, ములగ, రావికోనలో తోటలు పెరుగుతున్నాయి. బలిజిపేట మండలంలోని అరసాడలో మూడు అంగన్‌వాడీ కేంద్రాలు ఒకచోటే ఉన్నాయి. వీరికి స్థలం ఉండటంతో అన్ని రకాల కూరగాయలు, ఆకుకూరలు పండిస్తున్నారు. కొన్నిసార్లు పక్కనున్న పాఠశాలకు ఇస్తున్నారు. మిర్తివలస, నారన్నాయుడువలసలో ఈ విధానం అమలు చేస్తున్నారు.



పెదబొండపల్లిలో కూరగాయలు కోస్తున్న కార్యకర్త

ప్రోత్సాహం అందిస్తున్నాం..

పక్కా భవనాలు ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల్లో పెరటి తోటల పెంపకానికి శాఖ పరంగా కార్యకర్తలకు ప్రోత్సాహం అందిస్తున్నాం. బాగా సేద్యం చేస్తున్న కార్యకర్తలకు ఉత్తమ పురస్కారాలతో సత్కరిస్తున్నాం. – శ్రీనివాసరావు, పీవో, ఐసీడీఎస్ ప్రాజెక్టు, పార్వతీపురం

పాలకొండలో ట్రాఫిక్ ఆంక్షలు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రాంబాబు

పాలకొండ, గ్రామీణం, న్యూస్‌టుడే: విజయదశమి సందర్భంగా పాలకొండ పట్టణంలో శనివారం ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు డీఎస్పీ ఎం.రాంబాబు తెలిపారు. శుక్రవారం స్థానిక పోలీసు ఠాణాలో విలేకరులతో మాట్లాడారు. శనివారం సాయంత్రం 6 నుంచి కోట దుర్గమ్మ తిరువీధి సందర్భంగా ప్రధాన రహదారిలో వాహనాల రాకపోకలు నిలిపి వేస్తున్నట్లు చెప్పారు. అమ్మవారి ఉత్సవ విగ్రహం నాగవంశంవీధి కూడలికి చేరుకున్న తర్వాత ట్రాఫిక్‌ను పునరుద్ధరిస్తామన్నారు. ఇప్పటికే సంబంధిత ట్రయిల్ రన్ పూర్తి చేసినట్లు తెలిపారు. 100 మంది సిబ్బందిని బందోబస్తుగా నియమించామన్నారు. భక్తులకు ఇబ్బందులు ఎదురైతే పోలీసులకు, 112కు సమాచారం అందించాలని సూచించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సీఐ ఎం.చంద్రమౌళి, ఎస్సై ప్రయోగమూర్తి ఉన్నారు.

ఏనుగుల రాకతో పంటలు ధ్వంసం

పార్వతీపురం గ్రామీణం, సీతానగరం, న్యూస్‌టుడే: సీతానగరం, పార్వతీపురం మండలాల్లోని తాన్నసీతారాంపురం, పులిగుమ్మి పరిసర ప్రాంతాల్లో ఏనుగులు శుక్రవారం సంచరించాయి. వరి పొలాల్లో తిరుగుతూ పంటను ధ్వంసం చేశాయి. దీంతో నష్టం వచ్చిందని సీతారాంపురం రైతులు టి.రామినాయుడు, టి.శ్రీహరి, వెంకటరమణ, పులిగుమ్మికి చెందిన బి.వెంకటరమణ, సీతమ్మ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రత్యేక రేంజ్ అధికారి మణికంఠేష్ బృందం పర్యవేక్షణ చేస్తోందని డీఎఫ్‌వో జీఏపీ ప్రసూన తెలిపారు. నష్టాలను వీఆర్వోలతో కలిసి అంచనా వేస్తున్నట్లు చెప్పారు.



పులిగుమ్మిలో పాడైన వరి చేను

ప్రజలకు అందుబాటులో నిత్యావసరాలు

పార్వతీపురం పురపాలక, సాలూరు గ్రామీణం, కురుపాం గ్రామీణం, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను దశల వారీగా నెరవేరుస్తుందని ఎమ్మెల్యే విజయచంద్ర పేర్కొన్నారు. ప్రజలకు తక్కువ ధరలకు నిత్యావసరాలు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. శుక్రవారం జేసీ అశుతోష్ శ్రీవాస్తవతో కలిసి వంటనూనె పంపిణీ చేశారు. సాలూరులో మాజీ ఎమ్మెల్యే ఆర్పీ భంజ్‌దేవ్, తహసీల్దారు ఎన్.వి.రమణ, కురుపాంలో తెదేపా మండల కన్వీనర్ కె.వెంకటకొండయ్య నూనె అందజేశారు. నాయకులు జి.వెంకటనాయుడు, బి.సీతారాం, ఎన్.చిట్టి, ఎ.రమేష్, శ్రీను, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



సాలూరులో నూనె ప్యాకెట్లు అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే భంజ్‌దేవ్, నాయకులు

కొండపై తవ్వకాలు ఆపాలి

కలెక్టరేట్ ప్రాంగణం, న్యూస్‌టుడే: బడిదేవర కొండపై క్వారీ తవ్వకాలు చేస్తూ గిరిజనుల బతుకులతో ప్రభుత్వాలు చెలగాటం ఆడుతున్నాయని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.కృష్ణమూర్తి అన్నారు. బడిదేవర కొండపై తవ్వకాల పనులు ఆపాలని కోరారు. కొండను పలు గ్రామాల ప్రజలు దైవ సమానంగా భావిస్తున్నారన్నారు. అటవీ అనుమతులు లేకుండా ఎలా తవ్వుతున్నారని ప్రశ్నించారు. సంఘ నాయకుడు రాము ఉన్నారు.

హామీలు నెరవేర్చాలని డిమాండు

సాలూరు గ్రామీణం, న్యూస్‌టుడే: ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేర్చాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఆర్.వేణు డిమాండ్ చేశారు. పార్టీ మహాసభల ప్రారంభం సందర్భంగా సాలూరు గాంధీనగర్‌లో సీనియర్ సభ్యుడు పోలరాజు జెండాను ఆవిష్కరించారు. నాయకులు మాట్లాడుతూ.. సాలూరులో మూత పడిన జూట్ మిల్లును తెరవాలని కోరారు. 100 పడకల ఆసుపత్రి పనులు పూర్తి చేయాలన్నారు. రైతు బజారును వినియోగంలోకి తీసుకురావాలన్నారు. నాయకులు శంకరరావు, శ్రీనివాస్, రవి, నాయుడు, రాముడు, శ్రీను పాల్గొన్నారు.

తెదేపాలో చేరికలు



భూదేవితో పార్టీలో చేరిన వారు

పాలకొండ గ్రామీణం, న్యూస్‌టుడే: వీరఘట్టం పట్టణానికి చెందిన వైకాపా కార్యకర్తలు శుక్రవారం తెదేపాలో చేరారు. నియోజకవర్గ బాధ్యురాలు పడాల భూదేవి, నాయకుడు కె.వెంకటరమణ ఆధ్వర్యంలో పలువురు కండువాలు వేసుకున్నారు. కోటదుర్గ మోటారు విభాగం, కళాసీ సంఘాధ్యక్షులు సీహెచ్.శ్రీను, రాజారావు, వార్డు సభ్యుడు ప్రసాద్, ఎంపీటీసీ మాజీ సభ్యులు అప్పలనరసమ్మ, దుర్గాప్రసాద్, అప్పలనాయుడు తదితరులు చేరారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ ఎస్.దామోదరరావు, తెదేపా నాయకులు సుమంత్, సింహాద్రి, సర్వారావు, వెంకటనాయుడు, గజేంద్రనాయుడు తదితరులున్నారు.

21న చలో సీతంపేట ఐటీడీఏ

సీతంపేట, న్యూస్‌టుడే: గిరిజన ప్రాంతాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 21న చలో సీతంపేట ఐటీడీఏ కార్యక్రమం నిర్వహిస్తామని గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.లక్ష్మణరావు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. జీవో 3 అమలుకు చట్టబద్ధత, ఆదివాసీలకు ప్రత్యేక డీఎస్సీ, గిరిజన ప్రాంత రహదారులు, ఇంటింటి కుళాయి పనుల పూర్తి, ఇతర సమస్యలను పరిష్కరించాల్సి ఉందన్నారు. గిరిజనులు పాల్గొని కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘ నాయకులు అప్పారావు, శ్రీరాములు ఉన్నారు.

నూతన నియామకం

బలిజిపేట, న్యూస్‌టుడే: రాష్ట్ర దళిత బహుజన సేవా సంఘం ఉపాధ్యక్షుడిగా గళావల్లికి చెందిన నల్ల బారిక కామేశ్వరరావు నియమితులయ్యారు. రాష్ట్ర సంఘాధ్యక్షుడు సీహెచ్.సూర్యం నుంచి ఉత్తర్వులు వచ్చాయని ఆయన 'న్యూస్‌టుడే'కు తెలిపారు.

దుర్గమ్మా.. కరుణించమ్మా!



దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు జిల్లా వ్యాప్తంగా వైభవంగా జరుగుతున్నాయి. శుక్రవారం అమ్మవారికి ప్రీతికరమైన రోజు కావడంతో పలు మండపాల్లో మహిళలు సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. అమ్మవారు మహిషాసురమర్దనిగా దర్శనమిచ్చారు. ప్రధాన ఆలయాలకు భక్తులు తరలివెళ్లారు. – న్యూస్‌టుడే, బృందం

బలిజిపేటలో దుర్గాదేవి వద్ద కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు

నక్కలపేటలో కొలువైన విగ్రహం

కోటదుర్గమ్మ ఆలయంలో భక్తులు

జీఎల్‌పురంలో..

సూర్యపీఠంలో పూజలు

సరస్వతి దేవి రూపంలో దర్శనమిచ్చిన కామాక్షమ్మ

పార్వతీపురంలోని కళింగవైశ్య కన్యకాపరమేశ్వరి

కాశీ విశ్వేశ్వరాలయంలో లక్ష కుంకుమార్చన

ఉత్సాహంగా క్రికెట్ పోటీలు

పాలకొండ, న్యూస్‌టుడే: దసరా సందర్భంగా పాలకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. నియోజకవర్గంలోని 12 జట్లు పోటీల్లో తలపడుతున్నాయి. శుక్రవారం పాలకొండ- వీరఘట్టం జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో పాలకొండ విజేతగా నిలిచింది. ఆదివారం ఫైనల్ ఉంటుందని నిర్వాహకులు తెలియజేశారు.

మన్యంలో పర్యాటకుల సందడి

సీతంపేట: సీతంపేట మన్యంలో శుక్రవారం పర్యాటకులు సందడి చేశారు. సెలవు రోజు కావడంతో వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. పార్కులో సాహస, ఇతర క్రీడలు, బోటింగ్ చేస్తూ ఆనందంగా గడిపారు. మెట్టుగూడ, దోనుబాయి దరి సున్నపుగెడ్డ, మల్లి జలపాతాలు, ఆదలి వ్యూ పాయింట్‌ను సందర్శించారు.

విద్యార్థిని సత్తా



పాలకొండ గ్రామీణం: కేశవసాయి జూనియర్ కళాశాల విద్యార్థిని ఎస్.తులసి రాష్ట్రస్థాయి రేస్‌వాల్ పోటీల్లో సత్తా చాటింది. రాజమహేంద్రవరంలో జరిగిన పోటీల్లో ద్వితీయం స్థానం సాధించింది. బాలికను కళాశాల యాజమాన్యం అభినందించింది.

బాలికలకు నాణ్యమైన విద్యే లక్ష్యం



విజయసంకేతం చూపుతున్న బాలికలు, మహిళలు

భామిని, న్యూస్‌టుడే: బాలికల సాధికారతకు లింగ సమానత్వం కీలకమని హోలీ క్రాస్ సంస్థ డైరెక్టర్ కె.ప్రభుదాస్ అన్నారు. అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా భామినిలో శుక్రవారం ఆ సంస్థ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థతో బాలికలు చదువుకు దూరం అవుతున్నారన్నారు. చిన్నారులందరికీ నాణ్యమైన విద్య, గౌరవ ప్రదమైన జీవితం లభించేలా చూడాలన్నారు.

కేంద్ర పథకాల తీరు పరిశీలన



గ్రామంలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న కేంద్ర బృందం

పార్వతీపురం గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని కృష్ణపల్లిలో అమలవుతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల తీరును కేంద్ర బృందం ప్రతినిధులు ఎం.కె.శశిఅప్పన్, కె.జి.సలీంకుమార్ పరిశీలించారు. ఉపాధి కూలీలు, గృహ నిర్మాణ లబ్ధిదారులతో మాట్లాడి వివరాలు సేకరించారు. సచివాలయంలో దస్త్రాలను పరిశీలించారు. కొన్నింటి వివరాలు పూర్తిగా లేకపోవడాన్ని గుర్తించి పొందుపర్చాలని సిబ్బందికి సూచించారు. డీఎల్‌డీవో రమేష్‌రామన్, ఎంపీడీవో రూపేష్, ఏపీవో కృష్ణారావు, పీఆర్ డీఈ రత్నకుమార్, ఏఈ చిరంజీవులు పలు శాఖల అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

పక్కా కాలువల నిర్మాణం

సీతానగరం, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని సాలావారి వీధిలో పక్కా కాలువలు లేకపోవడంతో పడుతున్న ఇబ్బందులపై ఈనెల 4న 'మేమున్నాం.. మీకు తోడుగా'కు స్థానికులు విన్నవించారు. సమస్యను పంచాయతీ సర్పంచి తేరేజమ్మ దృష్టికి తీసుకువెళ్లగా ఆమె స్పందించి 100 మీటర్ల పక్కా కాలువ నిర్మాణం చేపట్టారు.



కాలువ నిర్మాణ పనుల్లో కూలీలు

సౌర విద్యుత్తు పథకం పరిశీలన

సీతంపేట, న్యూస్‌టుడే: సీతంపేట మండలం గెడ్డగూడలో మరమ్మతులకు గురైన సౌర విద్యుత్తు మంచి నీటి పథకాన్ని గ్రామీణ నీటి సరఫరా విభాగం సిబ్బంది పరిశీలించారు. 'సౌర విద్యుత్తు ట్యాంకు నిరుపయోగం' శీర్షికతో ఈ నెల 7న 'ఈనాడు'లో వచ్చిన కథనంపై సంబంధిత అధికారులు స్పందించారు. విద్యుత్తు లైన్, మోటార్ పరిశీలించి స్థానికులకు తాగునీరు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు.



స్పందనకు వందనం

పరిసరాలు శుభ్రం

సాలూరు గ్రామీణం, న్యూస్‌టుడే: సాలూరు పురపాలిక సంఘం పరిధిలోని పలు వీధుల్లో చెత్త పేరుకుపోయింది. పట్టణ ప్రజలు దుర్గంధంతో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పదీనిపై 'ఈనాడు'లో ఈనెల 11న 'సాలూరు పట్టణం చెత్తమయం' శీర్షికతో చిత్రవార్త ప్రచురితమైంది. అధికారులు స్పందించారు. డంపర్‌బిన్ల వద్ద పేరుకుపోయిన వ్యర్థాలను ట్రాక్టర్లలో డంపింగ్‌యార్డులకు తరలించారు. పూర్తిస్థాయిలో పారిశుద్ధ్య పనులు చేస్తామని శానిటరీ అధికారి రాజీవ్ తెలిపారు.